అదృష్టహీనుడు

రైలు నెమ్మదిగా నడుస్తోంది. హైద్రాబాద్ నుంచి, విజయవాడ వెళ్తోందా ఎక్స్‌ప్రెస్ బండి, వాతావరణం భీకరంగా వుండడంవల్ల రైలు నిదానంగా పోతోంది.

గాలి విసురుగా వీస్తోంది, వర్షం ఎడతెరిపిలేకుండా భయానకంగా కురుస్తూ ఉంది. చాలాచోట్ల పట్టాలమీదుగా ప్రవహిస్తోంది వర్షపు నీరు.

ఎక్స్‌ప్రెస్‌లో జనం కిటకిటలాడుతున్నారు. రాత్రి పదకొండు గంటలవుతుంది. అంతా కటిక చీకటి. సగానికి పైగా ప్రయాణీకులు అప్పటికే నిద్రలో పడ్డారు. పిల్లాజల్లా గప్‌చిప్‌గా సుషుప్తిలో ఉన్నారు.

కొందరు మొండిఘటాలు మాత్రం, చలినీ గాలినీ వర్షాన్నీ లెక్క చెయ్యకుండా, కిటికీల దగ్గిర కూర్చుని బైటి భీభత్సాన్ని చూస్తున్నారు. రైలుబండిలోని దీపాల వెలుగులో అద్దాల కిటికీమీద పడే చినుకుల ఉధృతాన్ని చూస్తూ కూర్చున్నాడు మూడవతరగతి ప్రయాణీకుడు సత్యనారాయణ. అతనూ కిటికీ దగ్గరగా కూర్చుని గాఢమైన ఆలోచనలో పడివున్నాడు.

అతని బాహ్యనేత్రాలు ప్రకృతి విలయాన్ని చూస్తున్నాయిగాని, మనస్సుమాత్రం అంతకంటే తీవ్రమైన సంక్షోభంలో పడి అల్లాడుతోంది. సత్యనారాయణ వుద్యోగంకోసం హైద్రాబాద్ వచ్చాడు సంవత్సరంక్రితం భార్యా పిల్లలతో సహా. తాత్కాలికంగా ఓ ఉద్యోగం దొరికింది కూడాను.

హైద్రాబాద్ నగరంలో అరవై రూపాయిల ఆదాయంతో, ఈ సంవత్సరం కాలం గడిపాడు. భార్య రోజూ ఏదో లేదనే పాట పాడుతూనే వుందిగాని, సత్యం, ఏమీ లేని నిరామయావస్థకంటే 60 రూపాయలన్నా వస్తున్నాయనే ఆశతో కులాసాగానే కాలం వెళ్ళబుచ్చుతున్నాడు.

అతనికి ఎలాగో బతకాలనేది తప్ప మరో ఆశయం లేదంటే అది అసహజం కాదు. చాలామందికి మల్లేనే అతనికీ భార్యన్నా పిల్లలన్నా అపరిమితమైన ప్రేమ.

అతని భార్య సావిత్రి చామనచాయగా బక్కపీచుగా వుండి, అతనికి అనుకూలంగా వుంటుంది. వాళ్ళ ఇద్దరు మొగపిల్లలూ ఇంకా చిన్న వాళ్ళు; పెద్దాడికి ఐదేళ్ళు; చిన్నాడికి సంవత్సరం, పిల్లలు సత్యం పోలికగా, ఎర్రగా బొద్దుగా వుంటారు. ఇదొక ప్రత్యేక కారణం, సత్యం, వాళ్ళంటే పంచప్రాణాలుగా ఉండడానికి.

ఆ మూడవతరగతి పెట్టె జనసమర్దంతో నిండి కిటకిటలాడుతోంది. విజయవాడ వెళ్ళేవాళ్ళు 60 మందికి పైగా వున్నారందులో, కొంతసేపటి క్రితం వరకూ మెలుకువుగా వున్న పది పన్నెండుమంది కూడా ఇప్పుడు కూర్చున్న పాళంగా జోగుతున్నారు.

సత్యం కిటికీనుంచి దృష్టి మరల్చి లోపలికి చూశాడు. ఎదురుగా వున్న సీటులోనే సావిత్రి కూర్చుని నిద్రపోతోంది. ఆమె ఒడిలో పడి నిద్రపోతున్నారు పిల్లలిద్దరూ.

అదే వరుసలో ఇంకా చాలామంది కూర్చునే నిద్ర పోతున్నారు. కారేజిలోని దీపాలు అట్టేప్రకాశంగా వెలగడం లేదు. పై చెక్కలమీదగూడా ప్రయాణీకులు పడుకుని ముసుగు లెట్టుకుని నిద్రపోతున్నారు.

సత్యనారాయణకెదురుగా కూర్చుని వున్న లావాటాయన మాత్రమే మేల్కొనివుండి దూరంగా బైట జరుగుతున్న ప్రకృతి కోలాహలాన్ని అతి శ్రద్ధగా పరికిస్తున్నాడు. ఆయన దుస్తుల్ని బట్టి ఆయన నైజాం నివాసి అని తేలిగ్గా తెలుస్తోంది.

సత్యం, జేబులోనుంచి ఓ బీడీతీసి వెలిగించాడు. అతనికి మౌనం భరించడం రానురాను కష్టంగా ఉంది.

ఆ క్షణాన రైలు చేసే చప్పుడూ, ఉరుముల ధ్వనీ, వానగాలి విసురుతప్ప మిగతా రైలు అంతటా నిశ్శబ్దంగానే ఉంది.

సత్యం, తిరిగి ఆలోచనలో పడ్డాడు.

ఎలాగో తొమ్మిది పదినెలలపాటు నెమ్మదిగా కాలం గడుపుకొన్న అతనికి, వారంకిందట ఉద్యోగంనుంచి విరమించమని 'ఆర్డర్' జారీ అయింది. ఆ కంపెనీ మేనేజరు, తనకింద జీతగాళ్ళందరికి ఆర్డర్ జారీచేశాడు. తలా ఐదువందల రుపాయల డిపాజిట్లు కట్టాలని, కట్టలేని వాళ్ళని విరమించుకోమని. సత్యం నోరుమూసుకుని విరమించుకోవాల్సి వచ్చింది. అతని దగ్గర అంత మొత్తం ఎక్కడిదీ?

భార్య తరఫువారుగూడా బీదవారే కావడంవల్ల అటునుంచి సానుభూతి ప్రకటనలు తప్ప మరో ప్రయోజనం ఆశించడానికి వీల్లేక పోయింది.

సత్యం తనకా నెల రావల్సిన జీతం బాకీ తీసుకుని విజయవాడ ప్రయాణమైనాడు... తిరిగి నిరుద్యోగం, పస్తులూ, అప్పులూ! సత్యానికి, రైలుబైట గాడాంధకారంలాగా తోచింది తన భవిష్యత్తు... అతని మనస్సు విరిగిపోయింది. ఏ ఆశా లేకుండా, నీరసంగా బతకడం ఎంత దుర్భరం!

సత్యం, ఈ ఆలోచనల్ని భరించలేకపోతున్నాడు.

2

సత్యం ఇలా ఆలోచనల్లో వుండగానే అతని కెదురుగా కూర్చునివున్న షావుకారు మెల్లగా ప్రారంభించాడు. ఇలాంటి సంభాషణలు 'వాతావరణం' గురించి ఆరంభించే మామూలు గనుక ఆయన, '' ఏమిటండీ ఈ వర్షాలు, నేనెరగను ఈ ముప్పై ఏళ్ళుగా!'' అన్నాడు, సత్యాన్నుద్దేశించి.

సత్యం, కొంచెం 'రిలీఫ్' దొరికినందుకు సంతోషిస్తూ, ''నిజమేనండీ''! ఏదో విలయం వచ్చినమాదిరి వుంది- ఈ వానా, ఈ గాలి, ఏమిటో?'' అన్నాడు.

షావుకారు. ''మీ దేవూరు పంతులుగారూ?'' అన్నాడు చాలా సహజంగా, రైల్వే సంభాషణల్లో పరస్పర కుశల ప్రశ్నలు సహజం.

సత్యం ''విజయవాడ దగ్గర రామవరప్పాడు'' అని సమాధానం చెప్పి, ''మీరు ఎందాకా?'' అని తిరిగి ప్రశ్నించాడు.

షావుకారుగారు, తనపక్కనే అతి జాగ్రత్తగా వుంచుకుని కావలించుకునివున్న చిన్న తోలుపెట్టె మరీ దగ్గిరకి లాక్కుంటూ, ''బెజవాడదాకా వెళ్తున్నానండీ! వెధవరైలు నడవదేం? పేరేమో ఎక్సుప్రెస్సూ!'' అని విసుక్కున్నాడు.

సత్యం ఆయున పక్కనేవున్న తోలుపెట్టెవేపు చూశాడు. అంత ప్రేమగా దాన్ని కావలించుకుంటున్నాడంటే అది డబ్బున్న పెట్టె అయివుండాలి. డబ్బుకంటే ప్రేమాస్పదమైన వస్తువేం వుంది ఈనాడు మనిషికి? పెళ్ళాం బిడ్డలూ, అన్నదమ్ములూ అన్నీ డబ్బుతరువాతే... డబ్బు ప్రధానం. డబ్బును ఎంత జాగ్రత్తగానైనా కాపాడటం అవసరం. అతనీ ఆలోచనకు స్వస్తిచెప్పి ''ఎలా పోతుంది లెండి ఒక పక్క వానా, గాలీనూ? ఏదైనా ప్రమాదం సంభవిస్తే? అందుకని...'' అని ఆపేశాడు.

షావుకారు ఒకసారి ఆవులించి రెండు చిటికలేసి ''ప్రమాదం!'' అని అన్నాడు కొంచెం గట్టిగా వత్తి.

''నేను ఊరికే అన్నానులెండి? ప్రమాదాలు జరుగుతయ్యా! రైల్వేవారు ఎంతో జాగ్రత్తగా వుంటారుకదా...'' అన్నాడు సత్యం. తనవంటి దురదృష్టవంతుడు ప్రయాణం చేస్తున్న బండి సర్వజాగ్రత్తగా తన లక్ష్యాన్ని చేరుకుంటుంది. తనింకా ఎంతోకాలం బతికుండి ఎన్నో బాధలు అనుభవించాల్సి వుందాయేను, అని అతని ఊహ. అతనికే నవ్వొచ్చింది ఈ ఆలోచనకి.

షావుకారు తిరిగి మౌనంలో పడ్డాడు - ఆయనకేం ఆలోచనలో!

సత్యం, భార్యవంకా, పిల్లలవంకా చూశాడు వాత్సల్యంతో. పిల్లలు నిర్మలంగా ఏ ఆలోచనా లేకుండా సంతోషంగా నిద్రిస్తున్నారు. తూలుతూవున్న భార్య మొహంలో ఏమిటేమిటో ఆలోచనల రేఖలు అగుపిస్తున్నాయి. ఆమె తనను పెళ్ళాడాక ఇంతవరకు ఏనాడూ సుఖం అనుభవించలేదు... ఎప్పుడూ ఏదో లోటుతో, సంసారజీవితం నరకంగా తయారయిందామెకి. తనకూ అంతే... కాని...

అప్పటికా ఆలోచన మానేసి సత్యం, సావిత్రి ఒడిల్లో మెదుల్తున్న చిన్న కుర్రాణ్ణి చూశాడు. సావిత్రికూడా కుర్రాడు లేచేసరికి మేల్కొంది. ఆమె భర్తవంక చూసి, ''మీరు ఒక్క కునుకైనా తియ్యలేదండీ?'' అని అడిగింది.

''లేదు, నిద్రపట్టలేదే... ఈ గోలకి'' అన్నాడు బైటికి చూస్తూ.

'' ఇంకా తగ్గలేదూ వాన?'' అంటూ, కుర్రాడికి పాలిస్తోంది సావిత్రి. కుర్రాడు పాలు త్రాగి, తండ్రివైపు తిరిగి, నవ్వాడు అమాయకంగా.

''వాణ్ణిలాతే చూడు వాడు, ఎలా ఎగబడి పోతున్నాడో'' అన్నాడు సత్యం చిరునవ్వు నవ్వుతూ.

షావుకారు, దీన్నంతా గమనిస్తూ కూర్చున్నాడు.

సత్యం పిల్లాడ్ని అందుకుని ఆ బుగ్గా ఈ బుగ్గా ముద్దాడి, ''వెధవ వీడైనా పెద్ద ఉద్యోగం చెయ్యాలి... చేస్తావా నాన్నా?'' అని ప్రశ్నించాడు కుర్రాణ్ణి.

కుర్రాడు నిద్రమగతగావున్నా నవ్వాడు.

కుర్రాణ్ణి, తిరిగి భార్యచేతికిస్తూ, ''నిద్ర వస్తోంది వెధవకి, నిద్రపుచ్చు'' అన్నాడు. సావిత్రి తిరిగి, కుర్రాణ్ణి ఒడిలో హత్తుకుంది. రెండు నిమిషాలకల్లా ఆమెకూడా మగతనిద్రలో పడిపోయింది.

సత్యం, ప్రేమగా పిల్లవంక చూస్తూ కూర్చున్నాడు, ఏమీ ఆలోచించలేని స్థితిలో.

3

బండి, మెల్లగానే పోతూవుంది. దడదడ మోగే రైలుశబ్దమూ, ఇప్పుడు మరీ ఉధృతమైన వాన చప్పుడూ రైలునంతా ఆవరించి భయపెడుతున్నాయి.

ఇదివరదాకా కూర్చున్న షావుకారు జేబునించి ఓ చిన్న కాయితం మడతతీసి సత్యం చేతికిచ్చి ''ఇది కాస్త చదువుతారా పంతులుగారూ! ఏదో ఇంగ్లీషులో రాశాడు, నా కర్థమైచావలే!'' అన్నాడు.

సత్యం, ఆ కాగితం అందుకుని, చదివాడు లోలోపల. దాని సారాంశము, తనకు రావాల్సిన రెండువేలూ వెంటనే తెచ్చి ఇవ్వాలనీ, లేనిచో తనకు చాలా ఇబ్బందనీ, ఇంకా ఏవో వ్యాపారపు గొడవలుగూడా వున్నాయి అందులో

ఇదంతా విప్పిచెప్పాడు సత్యం.

షావుకారు, తిరిగి తనకాగితం జేబులో పెట్టుకుని, '' ఏం వ్యాపారాలండీ పంతులుగారూ! యుద్ధం

అయిపోయినాక రోజురోజుకీ ధరలు తగ్గిపోతున్నాయి. డబ్బుకి మా కటకటగా వుంది. ఈ రెండు వేలూ ఇయ్యాల పోగుచేసుకొచ్చేవరకు ప్రాణం అల్లాడి పోయిందనుకోండి'' అన్నాడు. అనేశాక ఏదో తప్పుచేసినట్టు మొహంపెట్టి భయంగా, తన తోలుపెట్టె ఇంకా దగ్గిరికి లాక్కున్నాడు.

సత్యం ఇది గమనించాడు. షావుకారుగార్కి భయం గాబోలు... ఆ పెట్టె యెవడైనా కాజేస్తాడని ... నవ్వాడతను. తనకు కూడా అందులో డబ్బుందని అనుమానమేగాని, నిజం తెలియదుగదా?.... సత్యం... ఏమిటో ఆలోచిస్తున్నాడు. అనుకోవటం తడవుగా ఈ షావుకారు రెండువేలు ఏ బాధో పడి పోగు చెయ్యగలిగాడు. తను? ఐదొందలు దొరుకుతాయని కల్లోనైనా అనుకోడానికి వీల్లేకపోవడం వల్ల కాదూ, ఉద్యోగానికి తిలోదకాలిచ్చి ఇలా బైరాగల్లే తిరుగు ముఖం పట్టాడు

సత్యం ఒక్కసారి ఎగిరిపడ్డాడు. తలుపు దగ్గిరగా వుండటం వల్ల చప్పున తలుపు పట్టుకున్నాడు.

బండంతా కదిలిపోతున్నది. అదే క్షణాన ఆ రైలులో ప్రయాణిస్తూన్న వందలాది జనం ఉలిక్కిపడి మేల్కొన్నారు. భీకరమైన దారుణమైన మోత వినిపించింది. చెట్లు విరిగి పడిపోతున్నట్లుగా, రైళ్లు ఢీకొన్నట్లుగా, సముద్రాల్లో వాయుగుండా లేర్పడ్డట్లుగా.... అంతా రెండు మూడు నిమిషాలే....

భీకరమైన మెరుపుల క్షణికమైన కాంతిలో సత్యం ఆ మూడవ తరగతి పెట్టెనుండి విసురుగావెళ్లి నదిలో పడ్డాడు.. అంతక్రితం క్షణమే. అతని మీదికి విరుచుకుబడ్డ షావుకారు కళేబరం అతనికి దిగ్భ్రాంతి కలిగించింది. అతని చేతికి దొరికిన కళేబరం అతనికి దిగ్భ్రాంతి కలిగించింది. అతనే చేతికి దొరికిన దేన్నో బలంగా పట్టుకున్నాడు. అయితే ఏం, అతను పట్టు తప్పిన వాడల్లే, ప్రళయ వేగంలో సుడులు తిరిగి ప్రవహిస్తున్న నదీ గర్భంలోకి పడిపోయాడు... అతనే కాదు!

విజయవాడ వెళ్తూన్న ఆ మొత్తంబండి, వంతెన కూలిపోవటంతో, ఒక్కసారే భయంకరంగా మోతపెడుతూ పెట్టెలన్నీ ఒకదాన్తొ ఒకటి ఢీకొని, నదిలోకి కూరుకుపోయినాయి.

మరునిమిషం, అక్కడ తుఫానుగాలి, ప్రళయ ఘోష, ఉధృతమయిన వాన, ఎడతెరపి లేసి చప్పుడూ, గుఁయ్‌మని, కొనవూపిరి వున్న వాళ్ళను సయితం చంపేగాఢాంధకారం మిగిలిపోయినాయి. నది కిరువైపులా చెట్లు విషాదంతో తల లూపుతూ, ఈ ప్రమాదానికి సాక్షీభూతాలై నిలిచాయి.

4

కోడి కూసేవేళ ఆ విరిగిపోయిన వంతెన దగ్గిరికి సహాయదళాలు వచ్చాయి. నది ఇంకా ఉధృతంగా ప్రళయంగా ప్రవహిస్తోంది కట్టల కెగబడి. వాన నీరు, నదీ ప్రవాహం ఏకమై అంతా సముద్రంలా వుంది.

చెట్ల చివరలు కనిపిస్తున్నాయి నదిమధ్యన.

ఇంకా దారుణమైన చీకటి ఆవరించేవుంది. తూర్పున ఎక్కడో సూర్యోదయపు తొలికాంతి కన్పిస్తోంది.

ఇంతవానలోనూ, నదీప్రవాహపు జలజల శబ్దంలోనూ, అక్కడక్కడ మానవ కంఠాల మూలుగులూ, పసిపిల్లల ఏడుపులూ విన్పిస్తున్నాయి.

సహాయకదళం వెంటనే పనికుపక్రమించారు.

శవాలు ఒడ్డుకి చేరుతున్నాయి. అన్ని శవాల్ని వరసగా పేరుస్తున్నారు. నీళ్ళుతాగి ఉబ్బిపోయి, గుడ్డలు లేకుండా, రంగు మారిపోయి పచ్చగా, నీలంగా ఉన్నాయి శవాలు. ఆడ మొగ భేదంలేదు.

రైలు పెట్టెలు ఏమైనాయో అంతులేదు.

తెల్లవారుతోంది. సత్యం, పైనుంచి మెల్లగా దేకుతూ నడిచివస్తున్నాడు. అతనికి జరిగిందేమిటో ఇందాకటినుంచీ కొద్దికొద్దిగా అర్థమౌతోంది.

'రైలు అంతా పడిపోయిందా? తనొక్కడేనా, ఇంకా చాలమందా? - సావిత్రీ పిల్లలూ ఏమైనారు? ఆ షావుకారు ఏమైవుంటాడు? సత్యానికి చలితో ఒళ్ళు కొంకర్లుపోయినట్టే భయంతో మనస్సుకూడా గడ్డకట్టుకు పోయింది. సత్యం నీళ్ళల్లోపడి కొట్టుకుపోతూ, ఈత వచ్చి వుండడంవల్ల ఒడ్డుకు చేరుకుని మెల్లిగా కుంటుతూ కుంటుతూ ప్రమాదస్థలానికి చేరుకున్నాడు.

సహాయకదళం వారిలో ఇద్దరు పోలీసులు అతన్ని రెక్కపట్టుకుని తీసుకొచ్చారు, తాత్కాలికంగా వేయబడిన ఒకడేరాలోకి. కాని సత్యం నిలవడు...

అతని మనసు ఒక్కసారి భ్రమలోంచి మేల్కొంది. అతను పట్టుకొచ్చిన తోలుసంచిని విసిరిపుచ్చుకుని డేరాలోకి పారేసి బైటికి పరిగెత్తాడు.

తెల్లారిపోయింది బాగా. భీకరమైన, చీకట్లు వెలిసి పోయినాయి. అక్కడి బీభత్సం ఇప్పుడు బాగా దృగ్గోచర మౌతోంది. సత్యం ''సావిత్రీ! సావిత్రీ!'' అని పెద్దగా అరుస్తూ శవాల్ని పేర్చిన చోట, వాటిచుట్టూ పరిగెత్తుతున్నాడు. సహాయకదళంవారూ, రైలు ప్రమాదంలో పడి బతికిన కొందరూ అతన్ని జాలిగాచూస్తూ వెంబడించారు.

అన్నీ పీనుగులు, రైలుపెట్టె లేమైనాయో అంతు లేదు. కొన్ని చెక్కలు మాత్రం ఒడ్డుకు వచ్చాయి, ఇంజనూ, ఒక కారేజి ఒంతెన ఈవల మిగిలి నిల్చున్నాయి మొగుడు పోయిన స్త్రీలలాగా. సత్యం ఒక్క నిమిషం ఆగి ఆలోచించాడు. ఈ శవాల్లో తన భార్యా పిల్లలు లేరు. వాళ్ళు బతికి వుండగూడదా? ఆశ!

తిరిగి చిగిర్చిన ఆశతో, ఆ స్మశాన వాటికలో అతను సహాయకులలో ఒకణ్ణి అడిగాడు.

''ఇంకెవరైనా ప్రమాదంనుంచి బతికారండీ?'' అని.

అతను సత్యాన్ని ఓదారుస్తూ ''మేము వచ్చి కూడా అంతా రెండుమూడు గంటలే - పదండి, వెతుకుతున్నాంగదా? అసలు మీ కథ ఏమిటో చెప్పండి!'' అని అడిగాడు.

సత్యం తన సంగతంతా చెప్పాడు. కాని. షావుకారు చేతిలోని తొలుపెట్టెను తనా చివరినిమిషంలో ఊతంకోసం పట్టుకొని నదిలో పడిపోవడం మాత్రం చెప్పలేదు.

''పాపం! వెతుకుదాం పదండి - మీరు కూచున్న పెట్టెమొత్తం అలాగేనదిలో పడిపోయి వుండాలి.''

ఇప్పుడా పరిసరమంతా ప్రమాదంనుంచి బతికి బైట పడ్డవారు తమ తమ బంధువులకోసం ఏడుస్తున్న ఏడ్పులతో, గాయాలు తగిలిన వారి మూలుగులతో, నదీజలపు ఘోషతో, దారుణంగా వుంది.

సహాయకులిద్దరూ, సత్యం ఆ ప్రదేశాన్నంతా వెతుకుతున్నారు. కొందరు నీళ్ళల్లోంచి కొత్త కొత్త శవాలను లాగి బైట పడేస్తూనే ఉన్నారు.

సత్యం వొడ్డుమీద అటూ ఇటూ పరిగెత్తే వాడల్లా ఒక పెద్ద చెట్టు మొదట్లో సగం నీటిలోనూ సగం నేలమీద పడివున్న ఒక స్త్రీ శవాన్ని గుర్తించి అరిచాడు; ఒకటి రెండు నిమిషాలు స్తంభించి పోయాడు.

బాగా మరుగ్గా పొదల్లావుండే ప్రదేశంలో పడివుందా శవం. సత్యం బురదలోకి దిగి, శవాన్ని సమీపించాడు.

అతడొకవెర్రికేకవేశాడు. సావిత్రే ఆ శవం! ఆమె వొడిలో చిన్నపిల్లాడు సురక్షితంగా వున్నాడు. కదులుతున్నాడు గాని, చలితోటి వొణికిపోతున్నాడు. సత్యంతో పాటు వచ్చిన సహాయకులిద్దరూ సావిత్రి శవాన్ని బైటికి తీసుకొచ్చారు. కుర్రవాణ్ణి సత్యం ఒడ్డుకు తెచ్చాడు. అతను ఇప్పుడు తేటగా అగుపించడం లేదు. అతని మొహం వివర్ణంగా వుంది. గాలిలో తేల్తున్నట్లు నడుస్తున్నాడు.

అతని వికలమైన మనస్సులో తోలుసంచీ, అందులోని డబ్బూ సావిత్రి వికృతమైన శవం. కనపడని పెద్ద కుర్రాడూ, అన్నీ ఒక్కసారే కనిపిస్తున్నాయి...

సత్యంలో ప్రతి నిమిషమూ, ఒక ఉద్వేగమూ, ఆవేదనా తుపానులా పెరిగిపోతున్నాయి. తనది కాని పెద్దమొత్తం డబ్బు ఈ నిమిషాన తనదే ఐపోయింది. కాని తన ప్రేమాస్పదమైన భార్యా పిల్లలు ... దూరమై ఛిన్నా భిన్నమైపోయారు. చిన్న పిల్లాడు కూడా ఈ చలిలో వానలో ఎంతసేపో బతకడు.. సత్యం, కురుస్తున్న జడివానమంచి, డేరాలోకి పరిగెత్తాడు. అతనిలో తీవ్రమైన ఏదో సంఘర్షణ పెరిగిపోతోంది....

అతన్ని సహాయక దళంవారు పట్టుకుని కూర్చోబెట్టారు. అందులో ఒకతను ఇంకో అతనితో, సత్యాన్ని చూపిస్తూ, ''ఈయన అదృష్టవంతుడేనోయ్! పిల్లవాడేనా దక్కాడు... అంటున్నాడు.

సత్యం, డేరా మూలన పడుకోబెట్టి కొనవూపిరితోటి మెదుల్తోన్న కుర్రాణ్ణి, ఆ పక్కనే వున్న తోలు సంచిని కేంద్రీకరించి ఒక్క చూపు చూస్తూ, నిమిషం పాటు నిలబడ్డాడు. సావిత్రీ - డబ్బూ, అతని మనస్సును రెండు వేపులా గుంజుతున్నాయి. నది ఒడ్డున దిక్కులేక పడివున్న శవాలూ, ముక్కలైన చేతులూ కాళ్ళూ, అన్నీ అతన్ని చూట్టూ తిరిగి చప్పట్లు చరుస్తున్నట్టుగా వుంది.

అతని మతి భ్రమించింది.

అతను పెద్దగా ''సావిత్రీ!'' అని అరుస్తూ, డేరాబైటికి పరిగెత్తాడు, సహాయకులు వెంటపడ్డా విదిలించుకుని.

('రక్తస్పర్శ' కథల సంపుటి, 1963)